సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం ◆ 28 ◆ మార్చి ◆ 2024



సోమశిలలో 10.309 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో బుధవారం 10.309 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి వివిధ కాలువలకు 1520 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.68,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,175
3శాతం జీఎస్టీతో	రూ.6,360
నవర (8గ్రా)	రూ.50,880

గరిష్టం/కనిష్టం
35.6 /25.0

వాతావరణం

బుధవారం గాలిలో తేమ 63 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. గురువారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
గురువారం	శుక్రవారం
6:26	4:51

న్యూస్‌రీల్

ఓటర్ల పెండింగ్ అర్జీలు పరిష్కరించండి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, డీఆర్‌ఓ

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్రంలో ఓటర్ల చేర్పులు, మార్పులకు సంబంధించిన అన్ని రకాల పెండింగ్ అర్జీలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం సచివాలయం నుంచి ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో నగదు, మద్యం సీజ్ చేసిన వాటి వివరాలపై ప్రతి రోజు నివేదిక ఇవ్వాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు అక్రమ రవాణాపై తనిఖీలను పెంచాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ హరినారాయణన్, డీఆర్వో లవన్న తదితరులు హాజరయ్యారు.

ప్రజలతోనే వైఎస్సార్‌సీపీకి పొత్తు

• ఎంపీ విజయసాయిరెడ్డి



నెల్లూరు(దర్గామిట్ట): ప్రజాబలమే వైఎస్సార్‌సీపీ ధైర్యమని, ప్రజలతోనే తమ పొత్తని రాజ్యసభ సభ్యుడు, నెల్లూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ ఏకమై వారి అంగబలం, డబ్బు, మీడియా ఉపయోగించినా ప్రజాబలం ముందు అవి సరితూగవని పేర్కొన్నారు. ప్రజాసేవలోనే వైఎస్సార్‌సీపీ ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ప్రతిపక్ష పార్టీలు తప్పుడు ప్రచారంతో ప్రజల్లో అలజడి సృష్టించే ప్రయత్నం చేస్తున్న తరుణంలో రాష్ట్ర ప్రజలకు నేనున్నానన్న ధైర్యం ఇచ్చేందుకు బస్సుయాత్రతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముందుకు వస్తున్నారని తెలిపారు. టీడీపీ ఇచ్చే హామీలు ఎప్పటికీ నెరవేరవని పేర్కొన్నారు.

సీతారామపురంలో విజయసాయిరెడ్డి రోడ్ షో నేడు

ఉదయగిరి (సీతారామపురం): సీతారామపురం మండల కేంద్రంలో గురువారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంటు అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి, ఉదయగిరి అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిలు కలిసి రోడ్‌షో నిర్వహిస్తారని మండల పార్టీ అధ్యక్షుడు చింతంరెడ్డి సుబ్బారెడ్డి తెలిపారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని తెలిపారు. మండలంలోని పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

ముగిసిన పది పబ్లిక్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదవ తరగతి పబ్లిక్ ప్రధాన పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈనెల 18వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. చివరి రోజు సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు సంబంధించి పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌కు సంబంధించి 28,428 మందికి 27,735 మంది హాజరయ్యారు. 693 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రైవేటుకు (ఒకసారి ఫెయిల్ అయిన వారు) సంబంధించి 1396 మందికి 720 మంది హాజరుకాగా 676 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా కోర్సులకు సంబంధించిన పరీక్షలు ఈ నెల 30వ తేదీ వరకు జరగనున్నాయి.

రూ.9.75 లక్షల నగదు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): ఎలాంటి రసీదుల్లేకుండా తీసుకెళ్తున్న రూ.9.75 లక్షల నగదును ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఎన్నికల నేపథ్యంలో తడికలబజార్ సెంటర్‌లో వాహన తనిఖీలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి దామోదర్‌రావు, నవాబుపేట ఎస్సై చంద్రవతి, సిబ్బంది బుధవారం చేపట్టారు. పప్పులవీధికి చెందిన వినోద్‌కుమార్ తన వాహనంలో ఎలాంటి రసీదుల్లేకుండా తరలిస్తున్న రూ.9.75 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం నగదును ట్రెజరీలో అప్పగించారు.

రంగనాథుడికి భక్తజన నీరాజనం

నేత్రపర్వంగా తల్పగిరీశుడి రథోత్సవం



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు

- భక్తజనంతో కిటకిటలాడిన రంగనాయకులపేట
- 'రంగడి' నామస్మరణతో పులకించిన సింహపురి



విశేషాలంకారంలో శోభిల్లుతున్న రంగడు



తల్పగిరి రంగనాథుడి రథోత్సవానికి హాజరైన అశేష భక్తజనం

నెల్లూరు(బృందావనం): అశేష భక్తజన గోవింద నామస్మరణల నడుమ తల్పగిరి రంగనాథస్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. శ్రీదేవీ, భూదేవీ సమేతంగా శ్రీవారు విశేషాలంకారంలో తేరుపై కొలువుదీరి భక్తులకు అభయమిచ్చారు. రథోత్సవాన్ని బుధవారం తిలకించేందుకు భక్తులు పోటెత్తి రావడంతో రంగనాయకులపేట కిటకిటలాడింది. రంగనాథుడి నామస్మరణతో సింహపురి పులకించింది. తొలుత ఆలయంలో దేవదేవేరులకు వేదపండితులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి తూర్పురాజగోపురం సమీపంలోని రథ మండపం వద్ద ఉన్న రథంలోకి తీసుకొచ్చారు. తొలుత జిల్లా దేవదాయ శాఖ అధికారి, బ్రహ్మోత్సవాల చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ జే శ్రీనివాసరావు, ఆలయ ఈఓ డబ్బుగుంట వెంకటేశ్వర్లు రథోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఉత్తర మాడ వీధి, తూర్పుగోపురం వీధి మీదుగా రైల్వేగేట్ వరకు రథోత్సవం సాగింది. తిరిగి గోపురంవీధి, రంగనాయకులపేట, సంతపేట, నాలుగుకాళ్ల మండపం వరకు వెళ్లి అక్కడి నుంచి వెనుదిరిగి ఆలయం వద్దకు చేరుకుంది. రథచక్రాలపై భక్తులు ఉప్పు, మిరియాలు జల్లి, కొబ్బరికాయలు, గుమ్మడికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

వేడుకగా ఎదురుకోలోత్సవం

బ్రహ్మోత్సవాల సంప్రదాయంలో భాగంగా రంగనాయకులపేటలోని నాలుగు కాళ్ల మండపం వద్ద ఎదురుకోలు ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. తల్పగిరీశుడికి వేదగిరి లక్ష్మీనృసింహస్వామి ఎదురేగి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే రంగనాథస్వామి ఉభయదేవేరులతో కలిసి లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలను అందజేశారు.

నారాయణా... నీకంత సీన్ లేదు

- నెల్లూరును స్మార్ట్ సిటీగా చేయలేకపోయావ్
- జగనన్న హయాంలోనే నెల్లూరు అభివృద్ధి
- రూ.1100 కోట్లతో నగర సుందరీకరణ
- ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే నెల్లూరు అభివృద్ధి చెందిందని, మాజీ మంత్రి నారాయణ చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. నాలుగున్నరేళ్లుగా మిన్నకుండిన నారాయణకు ఇప్పుడు నెల్లూరు కనిపించిందా అని ప్రశ్నించారు. సిటీ అభ్యర్థిగా ఖలీల్ అహ్మద్‌ను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినప్పటి నుంచి ఆయన్ను నారాయణ విమర్శిస్తున్నారని, తమ నాయకుడిని విమర్శించే అర్హత నారాయణకు లేదన్నారు. అభివృద్ధి అంటూ నారాయణ పదేపదే చెబుతుంటారని, భూగర్భ డ్రైనేజీకి రూ.49.5 కోట్లు అధిక టెండర్ వేశారన్నారు. హడ్కో ద్వారా 90 శాతం నగదును 11 శాతం వడ్డీతో అప్పుగా తెచ్చారన్నారు. 2016లో ఇందుకు సంబంధించి మొదటి విడత పేమెంట్ తీసుకున్నప్పటికీ మూడేళ్లలో నగరంలో పనులు పూర్తి చేయలేకపోయారన్నారు. రూ.830 కోట్లు హడ్కో నుంచి అప్పు తీసుకొచ్చి నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులు తెచ్చామంటూ డప్పు కొట్టుకున్నారని, వాస్తవానికి ఏడు దశాబ్దాల క్రితమే నగరంలో 13 డివిజన్లలో భూగర్భ డ్రైనేజీ ఉందని, ఆయన కొత్తగా తెచ్చింది ఏమీలేదని అన్నారు. మిగిలిన డివిజన్లలో ఏర్పాటు చేసిన భూగర్భ డ్రైనేజీ, మంచినీటి వసతి మధ్యలోనే వదిలేశారన్నారు. కార్పొరేషన్ ప్రజలపై మాత్రం రూ.830 కోట్ల అప్పుల భారం మోపారన్నారు. అన్ని కోట్ల పనుల్లో వాటర్ పైప్‌లైన్ కోసం ఒక్క ఇంటికైనా కనెక్షన్ ఇచ్చారా అని ప్రశ్నించారు. కేవలం కాంట్రాక్టర్ల లబ్ధి కోసమే పనులు చేపట్టారన్నారు. కార్పొరేషన్ బకాయిలలో రూ.730 కోట్లు జగనన్న ప్రభుత్వమే చెల్లించిందని అన్నారు. 2016లో కేంద్రం స్మార్ట్ సిటీలుగా తిరుపతి, విశాఖపట్నం, కాకినాడ, అమరావతి ప్రాంతాలను ప్రకటించిందన్నారు. తద్వారా ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. అప్పుడు అదే శాఖలో ఏపీలో నారాయణ, కేంద్రంలో వెంకయ్య నాయుడు ఉండి కూడా నెల్లూరును ఎందుకు స్మార్ట్ సిటీలుగా చేయలేకపోయారని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో రూ.1100 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని అన్నారు. నగరంలో సర్వేపల్లి కాలువ, జాఫర్‌సాహెబ్ కాలువ, పెన్నా రిటైనింగ్ వాల్, పెన్నా బ్యారేజ్, అదనంగా మరో పెన్నా బ్రిడ్జి నిర్మించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు.

వ్యక్తిగత విమర్శలు చేయొద్దు

- కోడ్ పటిష్ట అమలుకు సహకరించండి
- పారదర్శక ఎన్నికల నిర్వహణకు అందరం కృషి చేద్దాం
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): ఎన్నికల ప్రచారాల్లో రాజకీయ పార్టీల నాయకులు వ్యక్తిగత విమర్శలు చేయకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రచారం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీసీ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ ఎన్నికల సంఘం నిబంధనలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని కోరారు. వ్యక్తిగత విమర్శలతో పాటు కుల, మతాల ప్రస్తావన లేకుండా ప్రచారం చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలు పూర్తి చేసే సమయంలో ఎటువంటి తప్పులు కొట్టివేతలు లేకుండా అన్ని ఖాళీలను పూర్తిగా నింపాలన్నారు. ఫారం-ఏ, ఫారం-బిలలో ఇంకుతో మాత్రమే సంతకాలు చేయాలని సూచించారు. భారీ ర్యాలీలు, సభలు, ప్రచారాలకు అనుమతి తీసుకోవాలని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు ఒక ప్రపోజర్‌ను, ఇతర అభ్యర్థులు పది మంది ప్రపోజర్లను పొందుపరచాలన్నారు. సెక్షన్ 127ఏ ప్రకారం అన్ని ప్రింటింగ్ ప్రెస్‌ల నిర్వాహకులు తాము ప్రచురిస్తున్న అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలు, ఇతర ప్రచార ముద్రణపై పబ్లిషర్ వివరాలు ముద్రించాలని, అలాగే ప్రింటర్లు, తాము ప్రింట్ చేసే ప్రచార అంశాలపై తెలియచేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 20,41,258 మంది ఓటర్లుగా నమోదై ఉన్నారని, వచ్చే నెల 15 వరకు ఫారం-6 ద్వారా ఓటు నమోదు ప్రక్రియ కొనసాగుతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 6644 ఫారం-6లు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ లవన్న, సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నుంచి జి నారాయణ, టీడీపీ నుంచి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రసూల్, బీజేపీ నుంచి శ్రీనివాస్, మస్తానయ్య, బీఎస్పీ నుంచి శ్రీరాం, ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్టీసీకి కొండబిట్రగుంట తిరునాళ్ల ఆదాయం రూ.6.6 లక్షలు



డిపో మేనేజర్ శ్రీనివాసులు

కావలి: కొండబిట్రగుంట తిరునాళ్ల సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ కావలి డిపోకు రూ.6,57,597 ఆదాయం వచ్చిందని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. శుక్ర, శని, ఆదివారాల్లో సాధారణ ఛార్జీలతో 24 బస్సులు నడుపగా, గత సంవత్సరం కంటే రూ.58,156 అధిక ఆదాయం వచ్చినట్లు ఆయన వెల్లడించారు. గత సంవత్సరం కిలోమీటర్‌కు 59.39 రూపాయల ఆదాయం రాగా, ఈ సంవత్సరం 67.54 రూపాయలు వచ్చిందన్నారు.

లౌకికవాదమే వైఎస్సార్‌సీపీ విధానం



మొగళ్లూరు గ్రామంలో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: లౌకిక వాదమే వైఎస్సార్‌సీపీ విధానమని, అందుకే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మతతత్వ పార్టీలతో పొత్తు పెట్టుకోలేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొగళ్లూరు, కనపర్తి, నరసింహకండ్రిక, గురవాయపాళెం గ్రామాల్లో బుధవారం మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సెక్యులర్ పార్టీ అని, అన్ని మతాలను సమానంగా చూస్తూ పాలన సాగిస్తుందని చెప్పారు. చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతుంటాడని, బీజేపీతో అవకాశవాద పొత్తు పెట్టుకున్నాడని తెలిపారు. చంద్రబాబుకు ఓటేస్తే సంక్షేమ పథకాలు అమలు కావని, ప్రజలు ఆలోచించుకుని ఓట్లు వేయాల్సిందిగా మంత్రి విజ్ఞప్తి చేశారు.

పగటి వేషగాళ్లను నమ్మొద్దు

ఎన్నికల సమయం వస్తే బయటి నుంచి నాయకులమని పగటి వేషగాళ్లు వస్తుంటారు. ఓడినా, గెలిచినా వారు ప్రజలకు అందుబాటులో ఉండరు. నేను మీ కుటుంబ సభ్యుడిని, మిమ్మల్ని కనిపెట్టుకుని ఉంటానని మంత్రి పేర్కొన్నారు. టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డి ఇక్కడి వాడు కాదని నెల్లూరు రూరల్ మండలానికి చెందిన వాడన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసి అందరికి అందుబాటులో ఉండే నాయకుడినని ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని పేర్కొన్నారు. మంత్రి రాక సందర్భంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వేణుంబాక చంద్రశేఖర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ సురేష్‌కుమార్‌రెడ్డి, సర్పంచులు ఆకుల లక్ష్మి, అట్లా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ చెన్నూరు విజయలక్ష్మి, నాయకులు యనమల రమణారెడ్డి, పలుకూరు నారాయణరెడ్డి, యాతం పెంచలరెడ్డి, రెడ్డిచర్ల అంకిరెడ్డి, యనమల శ్రీనివాసులు, ఆకుల గంగిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పొగాకు బ్యారన్ దగ్ధం



మర్రిపాడు: మర్రిపాడులో సోమల వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావుకు చెందిన పొగాకు బ్యారన్లు బుధవారం దగ్ధమయ్యాయి. అధిక వేడి ప్రభావంతో పొగాకు ఆకు టైర్లపై పడటంతో బ్యారన్‌లో మంటలు చెలరేగాయి. దాదాపు రూ.1.5 లక్షల మేర నష్టం సంభవించిందని బాధితులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

లారీల ఢీ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: లారీలు ఢీకొన్న ఘటన పట్టణంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నెల్లూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న లారీ రాఘవరెడ్డి కాలనీ సమీపంలో ధాన్యాన్ని లోడ్ చేసేందుకు ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొంది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో ప్రమాదం చోటుచేసుకుందని లారీ డ్రైవర్ తెలిపారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డీసీపల్లిలో 812 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 812 బేళ్లను బుధవారం విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 973 బేళ్లు రాగా, వాటిలో 812ను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించామని తెలిపారు. వేలంలో 97,921 కిలోల పొగాకును విక్రయించగా, రూ.2,22,96,749 వ్యాపారం జరిగిందని చెప్పారు. గరిష్ఠ ధర కిలో రూ.230 కాగా, కనిష్ఠ ధర రూ.220 లభించిందని, మొత్తమ్మీద సగటు ధర రూ.227.70గా నమోదైందని వివరించారు. వేలంలో 14 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారన్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధి



ఎన్నికల ప్రచారంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి

- ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: గడిచిన పది నెలల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎనలేని అభివృద్ధి చేశామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 20వ డివిజన్లో ఎన్నికల ప్రచారం.. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించి.. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సంక్షేమం, అభివృద్ధికే ప్రజలు పట్టం కట్టనున్నారని చెప్పారు. మేయర్ పొట్లూరు స్రవంతి, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన చైర్మన్ రావు శ్రీనివాసరావు, డివిజన్ ఇన్‌చార్జి తాళ్లూరు సురేష్‌బాబు, క్లస్టర్ – 2 ఉపాధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి, డివిజన్ నేతలు పోతురాజు రమాదేవి, ఆరుగుంట రాజారెడ్డి, చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, గొడుసు సరళమ్మ, పోలంరెడ్డి నాగేశ్వరరెడ్డి, కడివేటి ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన పేదల జీవన ప్రమాణాలు

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

సంగం: సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యమిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగించారని, రానున్న ఎన్నికల్లోనూ తమను మరోసారి ఆశీర్వదిస్తే మరింత సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు చేరువ చేస్తామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని దువ్వూరు పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు పీఏసీఎస్ అధ్యక్షుడు సూరి మదన్‌మోహన్ రెడ్డి, కొల్లి శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, పానుగోటి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విక్రమ్‌రెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని చెప్పారు. హామీల్లో 99 శాతాన్ని సీఎం అమలు చేశారని తెలిపారు. ఒక్క దువ్వూరు పంచాయతీలోనే డీబీటీ, నాన్ డీబీటీల ద్వారా 3037 మంది లబ్ధిదారులకు రూ.14.06 కోట్లను అందజేశామని గుర్తుచేశారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు రానున్న రోజుల్లో ఆర్వో ప్లాంట్‌ను రూ.ఐదు లక్షలతో ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. గ్రామంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణం.. మిగిలి ఉన్న సిమెంట్, గ్రావెల్ రోడ్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. చెలిక కాలువ రివిట్‌మెంట్ నిర్మాణ విషయాన్ని ప్రజాప్రతినిధులు, నేతలు తన దృష్టికి తీసుకొచ్చారని, దీన్నీ పూర్తి చేస్తామన్నారు. 2014 ఎన్నికల సమయంలో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు, వాటిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కూటమిగా వస్తున్నారని, వీరిని నమ్మొద్దని కోరారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యురాలు రావుల లక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, పందిళ్లపల్లి శివకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ ముడి మల్లికార్జునరెడ్డి, నేతలు మహబూబ్‌బాషా, సూరి, నారయ్య, గుండాల బాలచంద్రారెడ్డి, సర్పంచ్ మానికల చందు తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న విక్రమ్‌రెడ్డి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కావలి: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మరణించిన ఘటనపై కావలి రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. కావలి రూరల్ మండలం పెద్దరాముడుపాళేనికి చెందిన కాటంగారి చినగోపాల్ (28) కర్ణాటకలోని మంగళూరు సముద్ర తీరంలో చేపలు వేట చేసే బోట్లలో కూలీగా పనిచేస్తుంటారు. స్వగ్రామానికి నెల క్రితం వచ్చిన ఆయన గ్రామానికి చెందిన బుచ్చింగారి ఎర్రాతో కలిసి ఈ నెల 19న వెళ్లారు. అప్పటి నుంచి చినగోపాల్ కనిపించకపోవడంతో మంగళూరు వెళ్లి ఉంటారని కుటుంబసభ్యులు భావించారు. ఈ తరుణంలో బుచ్చింగారి ఎర్రా ఇంటి పక్కన కొంత మేర కాలిన శరీరం.. మృతదేహాన్ని పక్కనే పూడ్చేసిన ఆనవాళ్లు మంగళవారం సాయంత్రం కనిపించాయి. చినగోపాల్ ధరించిన దుస్తులతో పాటు కాలిన కాలు పాక్షిక భాగాన్ని అర కిలోమీటర్ దూరంలోని పొలంలో గుర్తించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీ ఆయాకు మెమో

- సోమిరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఫలితం

తోటపల్లిగూడూరు: టీడీపీ సర్వేపల్లి నియోజకవర్గ అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అంగన్‌వాడీ ఆయాకు ఐసీడీఎస్ అధికారులు మెమో జారీ చేశారు. మండలంలోని మల్లికార్జునపురం అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాగా ఈగా సరోజనమ్మ కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మల్లికార్జునపురంలో సోమిరెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాలుపంచుకున్నారు. ఈ విషయం ఓ చానల్లో ప్రత్యక్ష ప్రసారం కావడంతో సంబంధిత ఆయాపై ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదులందాయి. దీంతో ఆమెకు మెమోను ఐసీడీఎస్ ఇందుకూరుపేట ప్రాజెక్ట్ అధికారులు జారీ చేశారు. రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని మెమోలో పేర్కొన్నారు.

ఆర్ అండ్ బీ అతిథిగృహంలో పరిశీలన

నెల్లూరు (దర్గామిట్ట): నగరంలో ఆధునికీకరించిన ఆర్ అండ్ బీ అతిథి గృహాన్ని కలెక్టర్ హరి నారాయణన్ బుధవారం పరిశీలించారు. 2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చే ఎన్నికల పరిశీలకుల కోసం అతిథిగృహాన్ని ఆధునికీకరించామని ఆయన తెలిపారు. డీఆర్వో లవన్న, ఆర్ అండ్ బీ ఎస్ఈ గంగాధర్, డీఎఫ్ఓ చంద్రశేఖర్, డీఎస్ఓ వెంకటరమణ, ఈఈ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆ పార్టీలవి దిగజారుడు వ్యాఖ్యలు

- మేకపాటి రాజగోపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: టీడీపీ, జనసేన కనీస జ్ఞానం లేకుండా వలంటీర్లపై దిగజారి మాట్లాడుతున్నాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. దుత్తలూరులోని క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నిస్వార్థంగా ప్రజలకు సేవలందిస్తూ.. వారి మన్ననలు పొందుతున్న వలంటీర్లపై ఇష్టానుసారంగా మాట్లాడటం తగదని హితవు పలికారు. రాజకీయాల్లో పవన్ కల్యాణ్ జూనియర్ అని, చంద్రబాబు చెప్పిన తరహాలో ఆయన మాట్లాడి స్థాయిని తగ్గించుకుంటున్నారని విమర్శించారు. వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఐదు కోట్ల మంది ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వలంటీర్లపై ఇదే తరహాలో ప్రవర్తిస్తే ప్రజలు తగిన బుద్ధి చెప్తారని స్పష్టం చేశారు. పార్టీ కలిగిరి మండల కన్వీనర్ కాటం రవీంద్రరెడ్డి, నేతలు కొండారెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మాటలను ఎవరూ విశ్వసించరు

- ఖలీల్ అహ్మద్



ఎన్నికల ప్రచారంలో ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరాభివృద్ధిపై టీడీపీ నేతల మాటలను నమ్మే పరిస్థితుల్లో ఎవరూ లేరని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్ పేర్కొన్నారు. నగరంలోని 48వ డివిజన్ పరిధిలో గల కుక్కలగుంట, మహాలక్ష్మమ్మగుడి సెంటర్, ఉయ్యాలకాలువకట్ట, విరాట్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ఆయన నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి ప్రతి ఒక్కర్నీ ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ.. నెల్లూరు పార్లమెంట్ స్థానాన్ని తమ పార్టీ కైవసం చేసుకోవడం తథ్యమని తెలిపారు. నగర నియోజకవర్గాన్ని నారాయణ అభివృద్ధి చేశారనే టీడీపీ నేతల మాటలు హాస్యాస్పదమని విమర్శించారు. హడ్కో కింద అప్పులు తీసుకొచ్చి భూగర్భ డ్రైనేజీ పనుల పేరుతో రోడ్లను ఇష్టానుసారంగా తవ్వేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన అంశాన్ని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో చేసిన అప్పులను తమ ప్రభుత్వం తీర్చిందన్నారు. నగర నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అభివృద్ధి చేశారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనను.. నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. పార్టీ మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు, పార్టీ డివిజన్ ఇన్‌చార్జి సిద్దిఖ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరకంటే ఎక్కువకే కొనుగోలు



సమీక్ష నిర్వహిస్తున్న సత్యవాణి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని మద్దతు ధర కన్నా ఎక్కువకే వ్యాపారులు కొనుగోలు చేయనున్నారని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి పేర్కొన్నారు. నగరంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో పౌరసరఫరాలు, మార్క్‌ఫెడ్, ఇతర వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎక్కువగా కేఎన్ఎం – 1638, 733, ఆరెన్నార్ – 15048, బీపీటీ – 5204 వరి రకాలను సాగు చేస్తున్నారని పేర్కొన్నారు. వీటితో పాటు శనగ, వేరుశనగ, జొన్న తదితరాలను సాగుచేశారని చెప్పారు. రానున్న రోజుల్లో వరి కోతలు ఎక్కువగా జరగనున్నాయని, మద్దతు ధర కన్నా తక్కువ కాకుండా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు అన్ని విధాలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజలతో మమేకం..

- సరికొత్త ప్రచారంతో ముందుకెళ్తున్న బుర్రా



స్థానికులతో కలిసి టీ తాగుతున్న మధుసూదన్‌యాదవ్

కందుకూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ సరికొత్త ప్రచారంతో ముందుకెళ్తున్నారు. ప్రజలతో మమేకమవ్వడమే లక్ష్యంగా వివిధ వర్గాలను కలుస్తూ.. వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకుంటున్నారు. ఇందులో భాగంగా మార్నింగ్ వాక్ సమయంలో పట్టణంలోని పొట్టి శ్రీరాముల కూడలికి బుధవారం చేరుకొని ప్రజలను పలకరించారు. ఆ సమయంలో బేల్దారి పనులకెళ్లేందుకు పెద్ద ఎత్తున వచ్చిన కూలీలను ఆప్యాయంగా పలకరించారు. పనులెలా ఉన్నాయి.. కూలి ఎంత.. తదితర వివరాలను ఆరాతీశారు. ఇలాంటి పేదలను ఆదుకునేందుకు గానూ సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని చెప్పారు. అనంతరం ఆ ప్రాంతంలోని టీ కొట్టు వద్ద కూలీలతో కలిసి టీ తాగారు. పండ్లు, పూల వ్యాపారులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో వ్యాపారులు సంతోషం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా తనని, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు.

పోలీస్ సిబ్బందికి అవార్డులు



డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి సత్కారం

నెల్లూరు(క్రైమ్): పోలీస్ శాఖలో 2022లో ఉత్తమ సేవలందించిన పలువురు పోలీసులకు అవార్డులను డీజీపీ ప్రకటించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి తదితరులకు సిల్వర్ డిస్క్‌లు.. నెల్లూరు నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ షఫీ అహ్మద్, గతంలో పనిచేసిన సీఐ శ్రీరామ్ తదితరులకు బ్రాంజ్ డిస్క్‌లను ప్రకటించారు. ఈ క్రమంలో బ్రాంజ్ డిస్క్‌ను సాధించిన నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని డీఎస్పీ కార్యాలయ సిబ్బంది సత్కరించి శుభాకాంక్షలను తెలియజేశారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	:142
లేయర్ (లైవ్)	:73
బ్రాయిలర్ చికెన్	:250
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:278
లేయర్ చికెన్	:125

పొదలకూరు నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	:రూ.77
సన్నవి	:రూ.68
పండ్లు	:రూ.25

